మళ్లీ నీటమునిగిన పంటపొలాలు

- రెండురోజులుగా జోరుగా వర్షాలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- రాకపోకలకు అంతరాయం
- మునేరుకు భారీగా వరద నీరు

పెనుగంచిప్రోలు: అల్పపీడన ప్రభావంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పెనుగంచిప్రోలు మండలంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఎగువన తెలంగాణలోని ఖమ్మం, వరంగల్ జిల్లాలో కురుస్తున్న వర్షాలతో మునేరుకు మరోసారి భారీగా వరద నీరు చేరుతోంది. గతేడాది సెప్టెంబర్‌లోనూ మునేరుకు భారీగా వరదనీరు చేయడంతో రోజుల తరబడి పడిన ఇబ్బందులను గుర్తుచేసుకుంటూ లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. జోరుగా కురుస్తున్న వర్షాలకు ముచ్చింతాల సమీపంలోని గండివాగు, అనిగండ్లపాడు వద్ద కూచివాగుకు వరద నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలిగింది. పెనుగంచిప్రోలు నుంచి లింగగూడెం వెళ్లే రోడ్డులో లింగగూడెం వద్ద గండివాగు, శనగపాడు నుంచి నందిగామ వెళ్లే రోడ్డులో అనాసాగరం వద్ద వాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అనిగండ్లపాడు వద్ద దూళ్ల వాగు పొంగడంతో అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు వద్ద ఈఏడాది రెండోసారి నాట్లు వేసిన వరిపొలాలు నీట మునిగాయి. ఈ వర్షాలు పత్తి పొలాలకు తీరనినష్టం కలిగిస్తాయని రైతులు వాపోతున్నారు. పూత, పిందె రాలుతోందని, దిగుబడులు పూర్తిగా తగ్గిపోతాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కుండపోతగా వర్షం ...

కంచికచర్ల: రెండు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో కంచికచర్ల మండలంలోని పలు గ్రామాలక రాకపోకలు నిలిచిపోయాయి. కుండపోతగా కురుస్తున్న వర్షాలకు గొట్టుముక్కల, కంచికచర్ల, పరిటాల, గండేపల్లి, పేరకలపాడు, మోగులూరు, పెండ్యాల తదితర గ్రామాల పరిధిలో పంటపొలాలు నీటమునిగాయి.కీసర వద్ద మునేటికి భారీగా వరదనీరు చేరుతోంది. కంచికచర్ల నుంచి చెవిటికల్లు వెళ్లే రోడ్డుపై లక్ష్మయ్య వాగు పొంగిప్రవహిస్తుండటంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి ప్రజలు అవస్థలుపడ్డారు. కంచికచర్ల ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షపునీరు నిలబడటంతో బస్సుల్లో ఎక్కుందుకు, దిగేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కంచికచర్ల–జుజ్జూరు రోడ్డులో మోకాలిలోతు మేర వర్షపు నీరు నిలబడటంతో రాకపోకలకు వాహనచోదకులు, ప్రజలు తీవ్ర అవస్థలుపడ్డారు.ఈ వర్షాలకు పత్తి, పెసర తదితర పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మునేరుకు 13,322 క్యూసెక్కుల నీరు...

వత్సవాయి: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువన వరంగల్, ఖమ్మం జిల్లాలలో విస్తారంగా వర్షాలు పడుతుండడంతో మునేటికి భారీస్థాయిలో వరదనీరు చేరుతోంది. 8.5 అడుగుల మేర 13, 322 క్యూసెక్కుల వరదనీరు వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. లింగాల కాజ్‌వే వద్ద మునేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద మరింత పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. రెండురోజుల్లో మండలంలో 79.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గతంలో పడిన వర్షాలకు ఎరుపెక్కిన పత్తిచేను, ఈ వర్షాలకు మరింత దెబ్బతిన్నట్లేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.


పెనుగంచిప్రోలు: అనిగండ్లపాడు వద్ద నీటమునిగిన రెండోసారి నాట్లు వేసిన వరి పొలాలు

పొంగిపొర్లుతున్న వాగులు

నందిగామ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ నుంచి వరద భారీగా వస్తుండటంతో మండలంలోని దాములూరు కూడలి సమీపంలోని వైరాకట్టలేరుతోపాటు చెరువులు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. ముఖ్యంగా మండలంలోని చందాపురం గ్రామ సమీపంలోని నల్లవాగు కాజ్‌వే పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కొద్దిసేపు నందిగామ–చందాపురం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రం సమయంలో వాగు ఉధృతి తగ్గటంతో అధికారులురాకపోకలను పునరుద్ధరించారు. అడవిరావులపాడు వాగు పొంగడంతో నందిగామకు రాకపోకలు నిలిచిపోయాయి. శనగపాడు సమీపంలోని దూళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని కూడలి దాములూరు సమీపంలోని వైరా కట్టలేరు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో తహసీల్దార్ సురేష్‌బాబు, సీఐ వైవీఎల్ నాయుడు పరిశీలించి నందిగామ–వీరులపాడు మండలాల మధ్య రాకపోకలు నిలిపివేశారు. మండలంలోని పలు గ్రామాలలోని పంట పొలాల్లోకి వరద నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాకపోకలు నిలిపివేత...

వీరులపాడు: మండలంలో కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో పల్లంపల్లి వద్ద వైరాకట్టలేరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. బుధవారం ఉదయం నుంచి ఎడతెరపి లేని వర్షం కురవడంతో వాగులు, వంకలు సైతం పొంగి పొర్లుతున్నాయి. వరద ఉధృతి అధికంగా ఉన్న విషయం తెలుసుకున్న తహసీల్దార్ రవికుమార్, ఎస్ఐ అనిల్ వైరాకట్టలేరును పరిశీలించి రాకపోకలను నిలుపుదల చేశారు. పెద్దాపురం గ్రామసమీపంలోని ఏనుగుగడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పెద్దాపురం–గూడెంమాధవరం మధ్య రాకపోకలను నిలుపుదల చేశారు. దొడ్డదేవరపాడు కాజ్‌వేపైకి వరద నీరు చేరటంతో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వీరులపాడు–దొడ్డదేవరపాడు మధ్యన రాకపోకలను అధికారులు నిలిపివేశారు. పల్లపు ప్రాంత పంట పొలాల్లోకి సైతం నీరు చేరటంతో పలు రకాల పంటలు నీటమునిగి దర్శనమిస్తున్నాయి.


గండేపల్లిలో పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు


గండేపల్లిలో నీటి మునిగిన పెసర పంట


కంచికచర్లలో ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిచిన వర్షపు నీరు


చందాపురం వద్ద నల్లవాగు ఉధృతి తగ్గడంతో రాకపోకలను పునరుద్ధరిస్తున్న పోలీసులు


అనాసాగరం వద్ద వాగు పొంగడంతో నిలిచిన రాకపోకలు


వత్సవాయి మండలం లింగాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మునేరు


పెనుగంచిప్రోలు కాజ్‌వే వద్ద మునేరు వరద ఉధృతి

క్లుప్తంగా

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

జగ్గయ్యపేట: మండలంలోని గండ్రాయి గ్రామంలో గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ మహ్మద్ ఉమర్ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. గ్రామంలోని సాయి ఉష ఫెర్టిలైజర్, శ్రీసాయి ఉష ఫెర్టిలైజర్స్‌లో స్టాకు, రిజిష్టర్లను పరిశీలించారు. స్టాకు రిజిస్టర్‌లో తేడాలుండటంతో కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. రూ. 3.10 లక్షల విలువ చేసే ఎరువుల్లో తేడాలున్నట్లు గుర్తించారు. అదేవిధంగా జగ్గయ్యపేటలోని సాయిలక్ష్మి ఫెర్టిలైజర్స్‌లోనూ అధికారులు తనిఖీ చేశారు. తనిఖీల్లో ఏవో వరలక్ష్మి, , విజిలెన్స్ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాగులో చిక్కిన వింత చేప



ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలంలోని ముచ్చింతాల గ్రామ సమీపంలోని వాగులో వింత చేప వలకు చిక్కింది. వాగుకు వరద నీరు వస్తుండటంతో గ్రామానికి చెందిన కొందరు చేపలు పట్టేందుకు వల విసరగా, అందులో ఈ చేప వచ్చింది. పాముచారల్లాగా ఉన్న ఈ చేపను విషపు చేప అని, దెయ్యం చేప అంటారని స్థానికులు తెలిపారు. ఇతర చేపలను ఇవి తినే స్వాయంటుయని వారు వివరించారు.

డివిజన్‌లో 580 మి.మీ వర్షపాతం

నందిగామరూరల్: డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో 580 మి.మీల వర్షంపాతం నమోదైనట్లు ఉపగణాంకాధికారి ప్రసాద్ గురువారం తెలిపారు. చందర్లపాడు మండలంలో అత్యధికంగా 123మి.మీ వర్షపాతం నమోదు కాగా, నందిగామ మండలంలో 64.4మి.మీ, కంచికచర్లలో 98.8మి.మీ, వీరులపాడులో 96.2మి.మీ, జగ్గయ్యపేటలో 62.4మి.మీ, పెనుగంచిప్రోలులో 67.4మి.మీ, వత్సవాయి మండలంలో 67.8మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయన వివరించారు.

కృష్ణానదికి వరద ప్రవాహం

జగ్గయ్యపేట: ఎగువ ప్రాంతాలలో వరదలు వస్తుండటంతో మండలంలోని ముక్త్యాల గ్రామ సమీపంలోని పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజీకు కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. పరివాహక ప్రాంతాలైన ముక్త్యాల, రావిరాల, వేదాద్రి గ్రామాలలో కృష్ణానది క్రమక్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టు నుంచి గురువారం ఎనిమిది గేట్‌ల ద్వారా 2.75 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. నదీ పరివాహక గ్రామాలు అనుమంచిపల్లి, బలుసుపాడు, రెడ్డినాయక్‌తండ, బూదవాడ గ్రామాల ప్రజలు కూడా అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. తెలంగాణలో వర్షాలు కురుస్తుండటంతో పాలేరు కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది.

బోర్ల ఏర్పాటు పనులు ప్రారంభం



కంచికచర్ల: మండలంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన నిధులు మంజూరు చేసి బోరు పంపులు వేయిస్తున్నామని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ తెలిపారు. కంచికచర్ల అంబేద్కర్ నగర్‌లో రూ.2లక్షలతో చేపట్టిన రెండు బోరు పంపుల ఏర్పాటు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. తొలుత ఎంపీపీ మలక్‌బషీర్, ఎంపీటీసీ సభ్యుడు బర్రె ఉదయ్‌కిరణ్‌తో కలసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ మేరకు ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల్లో ఇప్పటికే అనేక బోరు పంపులు వేయించినట్లు వివరించారు. వార్డు సభ్యులు బర్రె శంకరరావు, చట్టి పద్మ, పెద్దలు ఉబ్బన శ్రీనివాసరావు, పగడాల వెంకీ, రేణుక, నవీన్, వంశీ, కోటి పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన మోటార్లు

తాగునీటి సరఫరాకు అంతరాయం



నందిగామటౌన్: వరద ఉధృతికి పట్టణ శివారు పల్లగిరి సమీపంలోని మునేటిలో ఏర్పాటు చేసిన మంచినీటి పథకం మోటార్లు కొట్టుకుపోయాయి. దీంతో నందిగామ పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో మునేటి ప్రవాహాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ లోవరాజు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంచికచర్ల మండలం కీసర, చందర్లపాడు మండలం గుడిమెట్ల పథకాల నుంచి వస్తున్న తాగునీటిని సర్దుబాటు చేస్తామని తెలిపారు. వరద తగ్గగానే మునేటిలోని పథకానికి మరమ్మతులు చేసి నీటిసరఫరాను పునరుద్ధరిస్తామని, అప్పటివరకు ట్యాంకర్లతో పట్టణ ప్రజలకు నీటిని సరఫరా చేస్తామని వివరించారు. కమిషనర్ వెంట ఏఈ ఫణిశ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

మనగ్రోమోర్‌లో అధికారుల తనిఖీలు

ఎరువుల అమ్మకాలు నిలిపివేత

నందిగామరూరల్: యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించినా, అక్రమ రవాణా చేసినా కఠినచర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆయాశాఖల అధికారులు గురువారం నందిగామ పట్టణంలోని మన గ్రోమోర్‌తోపాటు పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. రాష్ట్రం నుంచి తెలంగాణకు యూరియా అక్రమరవాణా సాగుతోందన్న సమాచారం నేపథ్యంలో సంబంధించి మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలోని ఈపాస్ మిషన్‌లోని స్టాకు వివరాలు, దుకాణంలో ఉన్న స్టాకును తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మనగ్రోమోర్‌లో ఎరువుల అమ్మకాలను తక్షణమే నిలిపివేసినట్లు తెలిపారు. దుకాణంలోని స్టాక్‌ను వ్యవసాయాధికారి ద్వారా రైతులకు విక్రయించేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. రైతులను ఇబ్బంది పెట్టే ఎరువుల దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, ఎస్ఐ అభిమన్యు, ఏవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మన గ్రోమోర్‌లో ఎరువుల స్టాకు వివరాలను పరిశీలిస్తున్న ఏడీఏ, అధికారులు

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

నందిగామటౌన్: వినాయక నిమజ్జనాల సందర్భంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ లోవరాజు, సీఐ వైవీఎల్ నాయుడు తెలిపారు. మండలంలోని పల్లగిరి సమీపంలోని మునేటి వద్ద చేపడుతున్న వినాయక నిమజ్జన ఏర్పాట్లను గురువారం వారు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మునేటికి వరద ఉధృతి అధికంగా ఉందని నిమజ్జనానికి వచ్చే భక్తులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పోలీసు వారి సూచనలకు అనుగుణంగా నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జగ్గయ్యపేట మండలంలో..

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ సమీపంలోని కృష్ణానదిలో వినాయక నిమజ్జన ఏర్పాట్లను చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్, ట్రైనీ ఎస్ఐ మణికంఠ పరిశీలించారు. వినాయక చవితి పెండుగ సందర్భంగా ఆయా గ్రామాల నుంచి విగ్రహాలు నిమజ్జనానికి వస్తాయని నది వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా బందోబస్తు చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణానదికి వరద వస్తుండటంతో పోలీసులకు సహకరించాలని కోరారు. ఆలయం ఆధ్వర్యంలో ఫంటు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వారు గురువారం తెలిపారు.

మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలి : సీపీఎం

నందిగామరూరల్: ప్రజలపై మోపిన విద్యుత్ భారాన్ని తగ్గించడంతోపాటు స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ చేపట్టనున్న మరో విద్యుత్ పోరాటానికి ప్రజలంతా సన్నద్ధం కావాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్‌సిహెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. విద్యుత్ చార్జీల వ్యతిరేక ప్రదర్శన సందర్భంగా 25ఏళ్ల కిందట బషీర్‌బాగ్ వద్ద పోలీసుల కాల్పుల్లో మృతిచెందిన అమరవీరులకు గురువారం స్థానిక గాంధీ సెంటరులో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు విధానాలలో భాగంగా 2000వ సంవత్సరంలో అప్పటి సీఎం చంద్రబాబు సర్కారు విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ ఆందోళన చేస్తున్న వారిలో ముగ్గురిని బలితీసుకుందని నాటి ఘటనను గుర్తుచేశారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్‌లను రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన టీడీపీ నేతలు, తీరా అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలు పెంచి స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ విధానాలకు నిరసనగా మరో విద్యుత్ పోరాటానికి ప్రతిఒక్కరు సిద్ధంగా ఉండాలని కోరారు. నాయకులు కటారపు గోపాల్, చుండూరు సుబ్బారావు, కోట కళ్యాణ్, సయ్యద్ ఖాశీం, గోపీనాయక్, రవిశేఖర్, లాజర్, కరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘననివాళి..

జగ్గయ్యపేటఅర్బన్: విద్యుత్ భారం తగ్గించాలని, స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని సీపీఎం పార్టీ జగ్గయ్యపేట మండల కార్యదర్శి సోమోజు నాగమణి డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ఘటన అమరవీరులకు గురువారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో నివాళులర్పించారు. ఈసందర్భంగా నాగమణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజలపై రూ.30 వేల కోట్ల భారం మోపిందన్నారు. మరో విద్యుత్‌పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు రావెళ్ల శేషు, వీవీ.రాంప్రసాద్, కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, దంతాల రాజేశ్వరి, జె.వెంకట్రావు, కోట రవికుమార్, కాకనబోయిన వెంకటేశ్వర్లు, షేక్ గౌస్‌మియా, తిరుపతిరావు, ఎలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారం...

వత్సవాయి: రాష్ట్రంలో మరో విద్యుత్ ఉద్యమానికి ప్రజలు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చిరుమామిళ్ల హనుమంతరావు పిలుపునిచ్చారు. విద్యుత్ చార్జీల తగ్గింపు కోరుతూ ఆగస్టు 28, 2000లో హైదరాబాద్ బషీర్‌బాగ్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలపై పోలీసులు జరిపిన కాల్పుల్లో అసువులు బాసిన అమరవీరులకు గురువారం స్థానిక వత్సవాయి గాంధీసెంటర్‌లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు విధానాల్లో భాగంగా ఆనాడు సీఎం చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్‌చార్జీలను పెంచడంతో ఆందోళనకు దిగగా, పోలీసుల ద్వారా కాల్పులు జరిపించి ముగ్గురిని బలితీసుకుందని గుర్తుచేశారు. తాజాగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారం మోపుతోందన్నారు. ఇందుకు నిరసనగా మరో విద్యుత్ ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రజలు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము, సభ్యులు కె. చిన్నవెంకటేశ్వర్లు, వై.వెంకటరత్నం, బి.పుల్లయ్య, షేక్ ఉద్దండు, కె.కోటయ్య, పి. వెంకయ్య, ఆర్.దేవయ్య, రాజు, సురేష్, జాన్ పాల్గొన్నారు.



గాంధీసెంటరులో అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

● కొలువుదీరిన గణనాథులు

వినాయకచవితి పర్వదినాన్ని జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని ఆయా పట్టణాలు, గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వివిధ రూపాల్లో ఉన్న పది నుంచి 20 అడుగుల ఎత్తుగల గణేష్ విగ్రహాలను చవితిపందిళ్లలో నిలిపి పూజలు చేశారు. మంటపాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. వినాయకుడి విగ్రహాలను ఆయా పార్టీల నాయకులు దర్శించుకుని పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


శ్రీతిరుపతమ్మ ఆలయంలో పూజలందుకుంటున్న గణపయ్య


కంచికచర్లలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, నాయకులు


నందిగామ : కేతవీరునిపాడులో కొలువుదీరిన గణపయ్య


వత్సవాయి: మంగొల్లులో పూజలు చేస్తున్న భక్తులు


పేట విశ్వబ్రాహ్మణవీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు


నందిగామలోని ముక్కోటి మండపంలో ఏర్పాటు చేసిన వినాయకుడు


జగ్గయ్యపేట పట్టణం పాతగడ్డపేటలో పూజలందుకుంటున్న గ్రీన్ గణపతి


వీరులపాడు మండలం జుజ్జూరు హాస్టల్ బజారులో కొలువుదీరిన గణనాథుడు

యూరియా కోసం రైతుల ఆందోళన



పెనుగంచిప్రోలు: యూరియా కోసం పెనుగంచిప్రోలులోని గ్రోమోర్ దుకాణం వద్ద రైతులు గురువారం ఆందోళన చేశారు. యూరియా స్టాక్ ఉన్నా రైతులు అడిగితే ఇతర ఎరువులు, బయో మందులు కొనాలని, ఆధార్, పొలం పాస్‌బుక్‌తోపాటు వేలిముద్రలు వేస్తేనే యూరియా కట్టలు ఇస్తామంటున్నారంటూ రైతులు ఆందోళనకు దిగారు. పొలం యజమాని ఎక్కడో ఉంటే పాస్‌బుక్, వేలిముద్రలు ఎలా సాధ్యమని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా చల్లక పొలాలు పాడవుతున్నాయన్నారు. కొందరికి మాత్రం ఎంత కావాలన్నా యూరియా కట్టలు లభిస్తున్నాయని విమర్శించారు. విషయం తెలుసుకున్న ఏఓ రామసుబ్బారెడ్డి గ్రోమోర్ ప్రతినిధులతో మాట్లాడి ఒక్కో రైతుకు ఆధార్ చూపిస్తే 2 నుంచి 3 కట్టలు స్టాక్ ఉన్నంత వరకు ఇవ్వమని తెలపడంతో రైతులు ఆందోళన విరమించారు.